# అరుకాషుడు

ఇంటికి చేరేప్పటికి తొమ్మిదాతోంది. హోలీ సెలవు ఫ్యాక్టరీకి. నేను వచ్చేప్పటికి గుమ్మంలో కాలు గాలిన పిల్లిలా తిరుగుతున్న మనిషి కాస్తా గార్డెన్‌లోకెళ్లిపోయారు. సామాన్లవీ లోపల పెట్టుకుని మంచినీళ్లు తాగుతూంటే, అపుడు లోపలికొచ్చారు, నన్ను పలకరించడానికి. బొత్తిగా ఇంత చిన్న పిల్లల్లాఎందుకు చేస్తారో!

"ఎలా జరిగింది ప్రయాణం? రైలు టైముకి చేరిందా?"

"రైలు ప్రయాణాలెలా జరుగుతాయో, అలాగే జరిగింది. రైలు టైముకే చేరింది. మన కారే 20 నిమిషాలు లేటు. పార్కింగు లాట్‌లో నన్ను ముప్పాళ్లు తినేశారు. ఒక్కసారి కూడా టైంకి కారు పంపరు! నే ఆటో మాట్లాడుకుంటూంటే అప్పడొచ్చాడు."

"నేనైతే నిన్ననే చెప్పేశాను రాజుకి - ఈ వేళ ఎనిమిదింటికల్లా స్టేషను వెళ్లాలని. కాన్ఫరెన్సెలా అయింది? ఎవరు వచ్చారు?"

"ఇనాగరేషన్‌కి ఢిల్లీనించి చిదంబరంగారొచ్చారు. చాలా మంచి ముక్కలు చెప్పారు. ఇంక సెషన్స్ మామూలే."

"మీ ఎంట్రప్రెన్యూర్సుకి ప్రత్యేకంగా ఏమీ చెప్పలేదా?"

"ఎందుకు చెప్పలే! ఒక్కో సెషన్లో ముగ్గురేసి పెద్ద స్పీకర్లూ, ఆరుగురేసి పిల్ల స్పీకర్లూ వచ్చి మమ్మల్ని వాయించేశారు. మేం ఎంత బాగా ప్లానింగ్ చేసుకోవాలో, ఎంత ధైర్యంగా ముందుకు పోవాలో, ఎంత గొప్పగా లేటెస్ట్ టెక్నాలజీని నేర్చుకోవాలో, హైటెక్ ప్రోడక్ట్స్ చేసి ఇంటర్నేషనల్ మార్కెట్‌లో ఎలా పోటీ చెయ్యాలో... వగైరా వగైరాలు. అక్కడ ప్రతీవాడూ మనల్ని పని సరిగ్గా చేయమని చెప్పేవాడే! ఇక చివరికి నాకొళ్లు మండిపోయి వెలిడక్టరీ ఔతుండగా, స్టేజెక్కేసి, మైకు లాక్కుని నే చెప్పాల్సినవి నాలుగూ చెప్పేశాను."

"చేశావూ ! అనుకున్నంత పనీ! దిగిపొమ్మని అరవలేదా?"

"నే రెండు నిమిషాలకన్నా మైకు ముందుండనుగా!"

"ప్రతి వాడూ మాకూ సలహాలు చెప్తారు! అసలు మన దేశంలో ఎవరైనా వాళ్ల పని వాళ్లు సక్రమంగా చేస్తున్నారా? బ్యాంకులు సమయానికి సొమ్మిస్తున్నాయా? పరిపాలకులు చెప్పినవి చేస్తున్నారా? సైంటి

స్టులు మంచి టెక్నాలజీలొండుతున్నారా? అవి మా చిన్నది చేసే కేకుల్లా ఉంటాయి! మాకోసం ఇంతమంది నరకాసుర సైన్యం మెయింటెనెన్స్ ఎందుకు? మేం ఎంట్రప్రెన్యూర్స్‌మా? సంఘ విద్రోహ శక్తులమా అని చెరిగేశాను."

"గొప్ప పని చేశావు! మధ్యలో నా కేకుల సంగతెందుకు చెప్పాలి? ఎంతైనా అత్తవనిపించావు. అంత మందిలో నా పరువు తీసావు!" ఇంకేముంది, మా చిన్నదాని - అంటే పుట్టినప్పట్నుంచి మేనకోడలు, నాలు గేళ్లనించి కోడలు- గారి అలక కార్యక్రమం మొదలైపోయింది.

"నా తల్లి. నువ్విక్కడే ఉన్నావా ఇంకా! నీ ఫ్రెండ్స్ రాలేదా, భూతాల్లా వేషాలేసుకుని?"

"వస్తార్లే! అప్పుడు పడతాం నీ పని."

"ఇంతకీ మీ కాన్ఫరెన్స్ పేరేమిటి ?" తనడిగారు.

"ఎంపవర్‌మెంట్ ఆఫ్ విమన్- ట్వంటీ ఫస్ట్ సెంచురీ - ఎ ప్రొజక్షన్!"

"తెలుగులో చెప్పు."

"ఇరవయ్యొకటో శతాబ్దంలో స్త్రీలకు స్వయం ప్రతిపత్తి - ఒక సమీక్ష. అనుకోండి. ఐనా ఇది హైద్రాబాద్ లో జరగలేదుగా. బొంబాయిలో జరిగింది. నాకు మరి మరాఠీ రాదు."

"ఫర్వాలేదులే. ఎంపవర్‌మెంట్ అంటే ఏమిటో అనుకుని కంగారు పడ్డా. ఎకనమిక్ అని ముందుం డాలేమో. నా ఉద్దేశ్యంలో మిగతా వాటిల్లో మీరు బాగానే ఎంపవర్ ఐనట్లున్నారు."

"స్వామీ మనింట్లో కాదు. మీరు చూడాల్సింది. ఒక్కసారి బయట ప్రపంచంలోకి తొంగి చూడండి. స్త్రీలు ఎన్ని రకాలుగా అన్యాయం అవుతున్నారో?"

"ఔను సుమీ! కట్నాలూ, లాంఛనాలూ అడిగేది మగవాళ్లే. పెళ్లిళ్ళ పేరు చెప్పి పట్టుచీరల మీద, నగల మీద ఇంకోళ్ల ఖర్చుతో హోదాలు పోయేదీ మగవాళ్లే. పెళ్లైనవాళ్లని తెలిసీ మగవాళ్లని చుట్టూతిప్పుకునేదీ మగ వాళ్లే. అత్తమామలకి తిండి పెట్టకుండా మాడ్చేదీ మగవాళ్లే. మీ వాళ్లూ, మావాళ్లూ అంటూ వేరు గీతలు గీసి హద్దులేర్పరిచేదీ మగవాళ్లే!"

"ఇదిగో అనవసరపు విషయాల జోలికెళ్లకండి! నాకస్సలే ప్రయాణంతో తిక్క తిక్కగా ఉంది."

"భోజనాలకొస్తారా? అమ్మాయీ నువ్వూ స్నానం చేసిరా!"

శృతి పెరిగినపుడల్లా మా అత్తగారు చక్రమడ్డేయడం మా కలవాటే.

"అప్పుడే భోజనాలేమిటి? వంట నే చేసేదాన్నిగా!"

"నువ్వు వాడితో వాదన తెవుల్చుకుని వచ్చి వంట చేసేప్పటికి నాకు నీరసం రాదూ?"

"కాదే! నువ్వొస్తే మళ్లీ రానీయవని ఎనిమిదింటికే బామ్మ చేసేసింది" చిన్నది రహస్యం చెప్పేసింది.

"పోనీ, నువ్వు సాయం చెయ్యకపొయ్యావా?"

"నాకేం రాదని మీటింగులో చెప్పావుగా! నా కావిషయం తెలిసిపోయి అస్సలు చేయలే?"

"నిన్ను మనదేశంలోని పెద్ద సైంటిస్టులతో పోల్చానే, పిచ్చి మొఖమా!"

నాలుగురోజులు ఇల్లొదిలి బయట తిరిగేప్పటికి నాకు అందరిమీదా బెంగొచ్చేసింది. బొంబాయిలో కాన్ఫరెన్సని నెల్లాళ్లు హడావిడి పడి ఐదారుగురం కలిసి వెళ్లాం. అక్కడ ఎరేంజ్‌మెంట్సన్నీ బ్రహ్మాండంగా చేశారు. కాని అసలెందుకు అక్కడ అంతమందిమి చేరామో ఆ పర్పస్ ఐతే సర్వైనట్లుగా అనిపించలేదు. ఏదో పాత ఫ్రెండ్స్ కొంతమంది కలిస్తే, కొత్తవాళ్లు కొంతమంది తెలిశారు. మైకు కనపడగానే ఆవేశపడిపోతూ, అది చేయండి, ఇది చేయండి అని అందరూ చెప్పేవాళ్లేగానీ ఒకళ్లకొకళ్లకి చెప్పేదాంట్లో పొంతనుండదు. సాధ్యాసాధ్యాలనేవి ఉంటాయని వాళ్లు భావించరు. నాణ్యమైన వస్తువులు చేసి అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీ చెయ్యమని బోధించే పెద్దలకి అస్సలు వాళ్లు ఏం అడుగుతున్నారో తెలిస్తేగా? మరి అమెరికా, జపాన్ వాళ్ల దగ్గిర అంతమంచి టెక్నాలజీలు, అక్కరలేనంత డబ్బు, మార్కెట్ మీద పట్టు, అన్ని సంవత్సరాల తయారీ అనుభవం ఉన్నపుడు నిన్న మొన్న కళ్లు తెరిచి ఆవలిస్తున్న మనని ఏ లీవరుందని పోటీ చెయ్యమంటారు? గారెలొండే వేలుతోనా?

మధ్యాహ్నం భోజనాల దగ్గర చెప్పా! "మళ్లీ చెప్పలేదనకండి. సాయంత్రం ప్రోగ్రాములు పెట్టుకోకండి. తెలుసుగా. మిమ్మల్ని బయటకెళ్లనియ్యనని. హోలీ సాయంత్రం!"

"అమ్మా, నువ్వు ఇంక పాత రూల్స్ మర్చిపో. మగపిల్లలకేవిటి భయం!"

చిన్నది చెప్తోంది "ఆడ రౌడీలుంటారని అత్తయ్యకి భయం".

"నే రెండ్రోజులు లేకపోయేప్పటికి దీనికి వాగుడెక్కు వైపోయింది."

"నువ్వు లేవని ఎవ్వరూ బెంగెట్టుకోకుండానన్నమాట".

నానా కష్టాలూ పడి పిల్లలెవర్నీబయటికి వెళ్లకుండా ఆపగలిగాను గానీ తర్వాత వాళ్లనేం చెయ్యాలో, ఎలా భరించాలో తల్చుకుంటేనే మతిపోయింది. ఇంతలోకీ అసలే కోతి, ఆపై కల్లు తాగిందన్నట్లు మా ఇంటి వెనకాల పెద్ద చప్పుడుతో ట్రాన్స్‌ఫార్మర్ పేలి పోయింది. ఇంక ఇప్పట్లో కరెంటొచ్చే ఆశ కూడా లేదు. కరెంటాఫీసుకి ఫోన్ చేస్తే ఎప్పుడూ ఎంగేజే. ఇక ఒకళ్ల తర్వాత ఒకళ్లు నెమ్మదిగా డాబా మీదకి చేరుకున్నాం. డాబా ఎక్కినపుడల్లా, గట్టిగా నిశ్చయించు కుంటా - రోజూ డాబా ఎక్కి వాకింగ్ చేయాలని. కానీ, మళ్లీ కరెంటు పోయినరోజే నేను డాబా ఎక్కేది. హోలీ చందమామ మంచి హుషారుగా ఉన్నాడు.

ఊరంతా కరెంటు పోయిందేమో, అందరి డాబాలూ కళ కళలాడుతున్నాయి. డాబా ఎక్కగానే, అక్కడున్న మడత మంచం నాదనుకునేశాను. మా అత్తగారి వడియాల కుర్చీ పీట ఎప్పుడూ డాబా మీదే ఉంటుంది. సరే, ఈయన ఓ చోట కూచోగా ఇన్నేళ్లలో నేనే ఒక్కసారి చూడలేదు. ఎప్పుడూ తిరుగుతూనే ఉంటారు. పిల్లలంతా పిట్టగోడ మీద వాలారు.

"అత్తయ్యా! ఏమీ తోచట్లేదు. ఓ పాట పాడు!"

"అడిగేదానికి సిగ్గుందా? మీ అమ్మ ఎంతో శ్రద్ధగా తొమ్మిదేళ్లు సంగీతం నేర్పించింది. ఓ పెళ్లన్నా పాడవు - పేరంటమన్నా పాడవు. పైగా నేను పాడాలట."

"కాదు. ఇలాటి వాతావరణంలో బాసెంపట్టేసుకుని కృతులు పాడితే బావుండవు. మరి నీకు బాగా గాలి పాటలు వచ్చని చెప్తావుగా! అవే ఇప్పుడు బావుంటాయి"

"నాకిప్పుడే పాడే ఓపిక లేదుగానీ, అందరం కలిసి తలా ఒక జోకైనా, కథైనా చెప్పుకుందాం."

"ఒకే కథ తలా కొంచెం చెప్దాం. చివరికెక్కడ తేల్తుందో?" మా పెద్దాడన్నాడు.

"సరే!! కానీ నేను చివరికి చెప్తా బాబూ"

"చివరికి కథ చెప్పినా కూడా నీదే ఆఖరి మాటన్నమాట. సరే కానీ, ముందు బామ్మ".

"ఏం కథ చెప్పేదిరా? రాజుల కథా? రైతుల కథా? దెయ్యాల కథా? దేవుళ్ల కథా?"

"అన్నీ కలిపి టీవీ కథ చెప్పండి. మీ పని ఎంచక్కా మొదలుపెట్టమేగా! ముగింపు చెప్పడం కష్టం కానీ మొదలుపెట్టడం ఎంత సేపు! మీకు నచ్చింది ఏదైనా సరే."

"అనగనగా ఒక ఊళ్లో ఒక అక్క, ఇద్దరు తమ్ముళ్లుండేవారుట."

"మరి వాళ్ల అమ్మా,నాన్నా?"

"అలా అడ్డం పడకూడదు. నాకు ఆలోచన సాగదు. ఈ కథ మొదలెట్టేసరికి వాళ్లు లేరు కాబట్టి లేనట్టే లెక్క. వాళ్లకేమో వాళ్ల ఊళ్లో బోలెడు పొలాలూ, తోటలూ, గొడ్లూ ఉన్నాయిట. వాళ్ల అక్కేమో తమ్ముళ్ల కోసమని పెళ్లి చేసుకోకుండా ఉండి పోయిందిట".

"అక్క పెళ్లి చేసుకోకపోతే తమ్ముళ్ల కేమిటి లాభం?"

"మధ్యలో అడ్డొస్తే చెప్పనన్నానా! సరే. అప్పుడేమైందిటా. ఆ అమ్మాయి పొలాలన్నీ కౌలుకిచ్చేసి తమ్ముళ్లని తీసుకుని చెన్నాపట్నం వెళ్లిపోయిందిట. వాళ్లని చదివించేందుకు."

"మనవాళ్లు చెన్నాపట్నం వెళ్లటం ఎప్పుడో మానేశారే. హైదరాబాదను. బావుంటుంది."

"సరే. హైదరాబాదొచ్చి నల్లకుంటలో కాపరం పెట్టి పిల్లల్ని ఇంటర్లో చేర్పించిందిట."

"అపుడు నాన్నా, నువ్వూ ఉండేవారక్కడేనా?"

"మేం చిక్కడపల్లిలో ఉండేవాళ్లం రా! ఛ. గాడిద నన్నే మార్చేశావు. ఇంక నే చెప్పను ఫో".

"ప్లీజ్! ఇంకొక రెండు ముక్కలు చెప్పవే!"

"అవటానీ! పాపం ఆ అమ్మాయి నానా కష్టపడి చదివించిందిట".

"కష్టాలెందుకూ పడటం. డబ్బుందన్నావుగా!"

"డబ్బుంటే సరిపోతుందా? మరి వాళ్లకి కోచింగిప్పించాలా? మళ్లీ దానికోసం సీటొచ్చేందుకు ట్యూషన్ చెప్పించాలా? రోజల్లా కాసుకునుండాలా? ఇలాటి కష్టాలన్నమాట."

"బామ్మా, నన్ను చెప్పనీయవే. దీపకింటికెళ్లచ్చంది అమ్మ" - మా పవన్ సాయంత్రంనించీ ఎటూ తిరక్క పోవడం మూలాన అపుడే కాళ్లు వాపులు చూపిస్తున్నాయి. వాడు మొదలెట్టాడు.

"వాళ్ల అక్క అంత కష్టపడి అంత శ్రద్ధగా చదివించింది కదా. అందుకని ఇద్దరికీ ఐ.ఐ.టి. మద్రాసులో కెమికల్ ఇంజనీరింగ్‌లో సీట్లొచ్చాయిట. మన అమ్మ కూడా అలా కష్టపడుంటే మనక్కూడ ఐ.ఐ.టి.లో సీట్లొచ్చే వన్నమాట.

ఒకే బ్రాంచైతే పుస్తకాలు కలిసొస్తాయని ఒకే బ్రాంచిలో చేరమందిట. వీళ్లకి ప్రత్యేకంగా ఏ ఐడియాల్లేక పోవడంతో వాళ్లక్క చెప్పినట్టే విన్నారట. ఇంక తమ్ముళ్లిక్కడ లేనపుడు తాను మాత్రం ఇక్కడెందుకని ఆవిడ వాళ్లూరుకెళ్లిపోయి పొలాలు చూసుకోవడంలో బిజీ ఐపోయింది. వీళ్లేమో బి.టెక్. ఐపోయాక అమెరికా వెళ్లి అక్కడ ఎమ్మెస్ పాసయి, పి.హెచ్.డి. చేసి పేద్ద కంపెనీల్లో పేద్ద ఉద్యోగాలు చేస్తూ హాయిగా ఉండి పోయారట. ఇంక కథ కంచికి...

"ఏందిరా? నువ్వెవడివిరా కథ కంచికి, బెనారస్‌కి పంపేదానికి ఆ పని ఆంటీ చేయాలె. ఇంకా నల్గురము న్నాము. నే చెప్తా అసలు కత!" మా చిన్నాడి తోక ఆలీ మొదలెట్టాడు.

"అక్కడ వాళ్లు మాంచి జబర్దస్త్ కంపెనీలల్ల కొలువు చేస్తున్నరంటివి గదా! మస్తు రిసెర్చి చేసిన్రట. చాన పేపర్లు పేటెంట్సు చేసుకుని పైసలకి పైసలూ, ఇజ్జత్‌కి ఇజ్జత్తూ కమాయించుకుని మంచిగున్నరట. ఇంత మధ్యల్లో వీళ్లిద్దరికీ మాంచి హైదరాబాద్ పోరీలతో నిక్కాలయినంట. రెండు పిల్లలు పుట్టినయ్యంట!"

"నాయనా ఆలీ, నీకు తెలుగు రాకపోతే హిందీలోనో, ఇంగ్లీషులోనో అఘోరించు. కాని తెలుగుని ఇంకా ఖూనీ చెయ్యకు. ఇద్దరేసి పిల్లలు పుట్టారని చెప్పు".

అట్లనే అనుకొండాంటీ. ఒక వంద మైళ్ల దూరంలో ఎవరిళ్లల వాళ్లుంటూ ఈద్‌లక్కలుసుకుని మజా చేస్కునే వారంట. రెండు మూడు సంవత్సరాలకి ఇక్కడికొచ్చి వాళ్లక్కను, అత్త మామలను చూసి

పొయ్యేటోళ్లంట. కానీ, పేర్లు లేకుంటే బాగలేదాంటి. వాళ్ల అన్నదమ్ముల పేర్లు రామ్ ఔర్ శ్యామ్, ఆళ్ల పెళ్లాల పేర్లు సీతా ఔర్ గీతా."

"సరే. నడిపించు నాయినా మన్మోహనదేశాయి నీ కథని ముందుకు!"

అన్ని మంచిగుంటే ఆడోల్ల దిమాక్‌ల లోల్లి షురూ అయితది కద. ఇంక రోజు సీత, గీత పరేషాన్ చేసేటోళ్లు. ఏమున్నదిక్కడ. పైసలు, బంగ్లాలు కార్లుంటే చాలా. మనమిక్కడ మంచిగున్నమని ఎవరు చూడాలె. ఎవరు మెచ్చాలె. ఊరూ పేరూ లేనోళ్ల లెక్క బతుకుతున్నం. ఒక ఇజ్జత్ లేదు, ఫలానోళ్ళమని పలకరించెటోళ్లు లేరు. ఏం బతుకిది. మనం హైద్రాబాద్ పోయి ఏదన్నా దంధా షురు చేస్కుంటే పదిమందిల తలెత్తుకు బతకొచ్చు. దీదీని కూడా పిల్చుకోవచ్చు. అంతగా మనకి చేత కాకుంటే మళ్లీ ఈడికి రావచ్చు. మన్ని కాదనేటోళ్లెవరిక్కడ ఇట్ల వాళ్ల ఆడోళ్ళు అనంగ అనంగ, వీళ్లు వినంగ వినంగ మన దేశం పోతే మంచిగనే ఉండే టట్లుందని అనిపిచ్చుడు షురూ అయిందిట."

ఇంతలో మా ఆయన ఇంటి యజమాననిపించుకున్నారు. ఎవరి పర్మిషనూ తీసుకోకుండానే తన కథ మొదలు పెట్టేశారు.

"వాళ్లిద్దరూ మంచి పేటంట్సవీ కూడా చేశారని చెప్పుకున్నాం కదా! ఒక ప్రోడక్ట్‌కి టెక్నాలజీ రెడీగా ఉంది. ఇండియా కొచ్చి మొదలుపెడితే బాగుంటుందని తోచిందిట. అది ప్రపంచం మొత్తంలో ఇద్దరో ముగ్గురో చేస్తున్నారట. 2, 3 కోట్లకన్నా అవదు. అందులో చంద్రబాబుగారు రమ్మని మరీ మరీ పిలుస్తున్నారు. వెళ్దామా అని సీరియస్‌గా ఆలోచించడం మొదలుపెట్టారుట."

"ఏడ్చినట్లుంది! మనిద్దరం కథలు మొదలుపెడితే ఎప్పుడూ ఇక్కడికే వచ్చేస్తాయి. చక్కగా చల్లగా సాగేవాళ్ల సంసారంలో ఇప్పుడీ అఘాతం ఎందుకు చెప్పండి?"

"నీ టర్న్ వచ్చినపుడు నువ్వు దయ్యాలని ఇంట్రడ్యూస్ చేద్దువుగానీలే! నన్నాపకు. ఐనా ఎవరిష్టం వచ్చినట్లు వాళ్లు కథ చెప్పొచ్చని మొదలుపెట్టి, నాదాక వచ్చాక నీ రూల్సేంటి? నన్నేమైనా గుత్తకి తీసుకున్నావా?"

"కాదు. అచ్చంగా తీసుకున్నాను. సరే చెప్పుకోండి. ఈ కథా కార్యక్రమానికి నేనే చైర్ పర్సన్ అని మర్చిపోకండి."

"నువ్విలాటి వాటికి చైర్ పర్సనవాల్సిందే! అపుడేమో రామ్, శ్యామ్ కలిసి ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారు చేసుకుని ఇండియా వచ్చి ప్రయత్నాలు మొదలెట్టారుట. ఇండియాలో దీని క్కావలసిన రా మెటీరియల్ ముఖ్యమైంది తయారుచేసే కంపెనీ ఒక్కటే ఉందిట. అది బరోడాలో ఉందిట. వీళ్లు అక్కడికివెళ్లి నాలుగైదు

సార్లు డిస్కస్ చేసి మొత్తం రా మెటీరియల్ ఇబ్బంది లేకుండా ఆ కంపెనీతో ఎగ్రిమెంటైపోయారుట. ఆ కంపెనీ ఎం.డి. కూడా వాళ్లలాగానే కుర్రాడు. చాలా చదువుకున్నవాడుట. పైగా పెద్ద బిజినెస్ హౌస్‌కి చెందిన వాళ్లు. వాళ్లవి కొన్ని వందల కోట్ల మీద వ్యాపారాలు. రెండు,మూడు సార్లు ఇండియా, అమెరికాల మధ్య ట్రిప్‌లు కొట్టి ఆర్నెల్లలో రెండు కుటుంబాలూ జూబిలీహిల్స్‌లో కాపరాలు పెట్టాయిట. వీళ్లు ఎన్నారైలు కాబట్టి పనులన్నీ అవే లెవల్లో ఐపోయాయిట. వీళ్లింటికే ఆఫీసర్లొచ్చి పనులు చేసి పెట్టారట. డిన్నర్లిస్తే చాలు. రకరకాల బ్యాంకులు రకరకాల లోన్లు ఇచ్చారుట. వీళ్లిద్దరివీ చెరో పాతిక లక్షలు మార్జిన్ మనీగా పెట్టి, ఊళ్లో పొలాలూ, భూములూ తనఖా పెట్టేటప్పటికి చక్కటి యూనిట్ పటంచెర్వులో వెలసిందిట. ముఖ్యమంత్రిగారి స్వహస్తాలతో ప్రొడక్షన్ మొదలు పెట్టించారుట."

"అన్నీ తమరేనేటండీ. మరి నన్నూ చెప్పనివ్వండి" - పనిపిల్ల అడ్డం పడింది.

"నువ్వూ ఇక్కడే ఉన్నావా నా తల్లీ! సినిమా కథలోకి దింపేయకు."

"అపుడైతే మరీ మంచిది కదండీ. సినీమా తీసేయచ్చు. మరండీ, అపుడేమో ఫ్యాక్టరీకి ఆరప్పగారి పేరు పెట్టారంటండీ. పేద్ద ఫ్యాక్టరీ ఉంటాది. కదండీ. రెండు గేట్లుంటాయి కదండీ. ఆ రెండు గేట్లకీ ఎదురుగా మధ్యలో గుండ్రంగా లైను తోటకూరేస్తారు కదండీ. ఆటి మధ్యలో గడ్డిమీద ఆ అమ్మగారిది నడుం వరకూ కనిపించేలా ఒక తెల్లటిరాయి విగ్రహం చేయించారంటండి. దానిమీదో మంటపం కట్టి రోజూ ఆ అన్నదమ్ము లిద్దరూ హారతిచ్చి దణ్ణపెట్టుకుని లోపలి కెళ్లేవారటండి."

"ఛ నోర్ముయ్! అవన్నీ చచ్చిపోతే చెయ్యాలి .నువ్వు కిందకెళ్లి ఫ్రిజ్జ్‌లో ద్రాక్ష పళ్లున్నాయి పట్రా!"

"నాకు బయవండె! నానెల్లను".

"నా పేరు తల్చుకుంటూ వెళ్లు. ఏంభయంవుండదు."

"కుంచెమీనా చెప్పనీలేదు" గొణుక్కుంటూ వెళ్లింది కిందకి.

ఇంక మావాడు మొదలుపెట్టాడు. వాడు కథ మొదలెట్టాడంటే అన్నీ కష్టాలే. అస్తమానం నాతో తిరుగు తుంటాడేమో, వాడికి సమస్యలు తప్ప ఇంకేమీ కనపడవు.

"అలా మొదలైన ఫ్యాక్టరీ సంవత్సరం తిరిగేసరికి చక్కగా లైన్లో పడింది. మనకన్నా బీదా బిక్కీ దేశాల్నుంచి పెద్ద పెద్ద ఆర్డర్లు రావడం మొదలుపెట్టాయి. ప్రపంచం మొత్తం డిస్ట్రిబ్యూషన్ రైట్స్ ఒక అమెరికన్ కంపెనీ తీసుకుంది. ఇలా అంతా పూలపడవలో విహారంలా సాగుతూండగా రామెటీరియల్స్ రావడం ఆలస్యం అవడం మొదలుపెట్టిందిట. ఐనా ఫర్వాలేదు. బయటనించి కొనుక్కుంటే అస్సలు గిట్టు బాటవదు. అని ఆర్నెల్లకి సరిపడా మెటీరియల్ స్టాకుంచుకుంటే ఈ సమస్యలుండవని బ్యాంకులవాళ్లని

ఒప్పించి బోల్డు అప్పు చేసి ఇంక తడువుకోనక్కర్లేకుండా చాలా రామెటీరియల్ తెప్పించి స్టాకు చేసుకున్నారుట. కానీ అదేమి శాపమో మొదటి బ్యాచ్ కలపగానే ప్రెసిపిటేట్ ఐపోవడం మొదలుపెట్టిందిట. ఎన్ని విధాలుగా మార్చి చేసినా ప్రొడక్ట్ బయటకొచ్చేదికాదుట. ఒకవేళ వచ్చినా ఈల్డ్ తక్కువ కలర్ డెవలప్ అయ్యేదిట. వీళ్లు కంగారు పడుతూ బరోడా పరిగెత్తారుట. మేం స్పెసిఫికేషన్స్ ప్రకారమే పంపాం. మీరు ప్రాసెస్ చెక్ చేసుకోండన్నారుట. తెలిసిన అన్ని లాబ్‌లకీ పరుగులు పెట్టారుట. ఎన్ని ఎనాలిసిస్‌లు చేసినా, రెండు సార్లు అమెరికా వెళ్లివచ్చినా పని కాలేదుట. ఇలా చూస్తూండగానే ఇంకో ఏడాది గడిచిపోయిందిట. ఈలోగా బ్యాంకులవాళ్లవి, కస్టమర్స్‌వి, డిస్ట్రిబ్యూటరువి, ఆఫీసర్లవి చుట్టాలవి, అప్పులవి, భార్యలవీ అన్ని పలకరింపు లు, మర్యాదల పర్వంలోంచి దెప్పుళ్ల పర్వంలోకి **పడిపోయాయిట**."

"ఛ! ఎంత పనిచేశావురా! నాన్న చక్కగా మంచి టెక్నాలజీతో ఫ్యాక్టరీ పెట్టారని కథ అందిస్తే, నువ్వు వాళ్లకి ఎన్ని కష్టాలు పెట్టావురా ఎంత సినిక్‌విరా నువ్వు. ఇంక సన్మానం చెప్పమంటావు. ఇంత ఛండాలంగా తయారయ్యాక. పోనీ, వీళ్లు బరోడావాడి మీద కేసు పెట్టారందామనుకుంటే అంతకన్నా ట్రాజెడీ ఉండదు. ఉండొక్క నిమిషం. ఐనా మీ ఆవిడ ఇంకా చెప్పలేదుగా! నువ్వు చెప్పవే. మళ్లీ ఛాన్సివ్వలేదంటావు!"

"నాకేం రాదుగా. నేనెందుకు చెప్పాలి. నువ్వే చెప్పుకో. నీకన్నీ వచ్చుగా! పాపం మంచివాడు కదా అని ఎప్పుడూ తన్ని ఏదో ఒకటి అనడమే."

"అమ్మా, తల్లీ! వాడు నీకు మొగుడు మాత్రమే. మాకేమీ కాడు. సరేనా! ఎవరికి తప్పినా నాకు తప్పదుగా. ఏదో మాట వరసకి అన్నానే అమ్మా. అంటే వినిపించుకోకుండా రోజంతా అలకడమే ముగ్గులేయడం లేదు."

"నువ్వే వేసుకో."

"అలా రోజులు గడుస్తున్న కొద్దీ, వ్యవహారాలు చిక్కుముళ్లు పడ్డం మొదలెట్టాయి. అన్ని పక్కలనించీ ముంచుకొచ్చేప్పటికి, ఆ అర్భకులు తట్టుకోలేక పోయారు. అప్పటివరకూ వాళ్లు జీవితంలో పగలే వెన్నెలా అని బతికిన వాళ్లాయె. సమస్యలనేవి ఇలా ఉండగలవని వాళ్లకి ఊహల్లో కూడా తెలియదు మరి. ఎన్ని ఫోన్లు చేసినా, లెటర్లు వ్రాసినా, ఫాక్స్‌లు పంపినా బరోడా వాడినించి రెస్పాన్స్ లేదు. కనీసం ఈ మిగిలిన మెటీరియల్‌ని తీసుకుని కొత్త దానితో రీప్లేస్ చేస్తారేమోనని దింపుడు కళ్లెం ఆశతో వాళ్ల ప్రొడక్షనింజనీరు శ్రీ రాఘవని పంపారు. మూడురోజులయ్యాక ఒక ఫోన్ కాల్ వచ్చిందతని దగ్గరనించి. "మెటీరియల్ రీప్లేస్ చేయడం వీలవదంటున్నారండి. నిన్న సాయంత్రం ఇక్కడ కంపెనీ క్లబ్ కెడితే, వాళ్ల ఛీఫ్ ఎడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కలిశారు. వాళ్ల ఛైర్మన్‌తో ఏదో దూరపు బంధుత్వం కూడా ఉన్నట్టుంది. మనం ఒప్పుకుంటే మొత్తం

ఎసెట్స్ లయబిలిటీస్ టేకోవర్‌కి ప్రయత్నిస్తానంటున్నాడు. తనకి 5లక్షలివ్వాలిట. ఈ మార్గం ఫరవా లేదనుకుంటే నేనిక్కడ ఇంకో రెండురోజులుండి విషయం అవగాహన చేసుకుని వస్తాను. ఏమంటారు?" విషయం కనుక్కు రమ్మని వీళ్ల సమాధానం.

పైకెంత కబుర్లు చెప్పినా ఎన్ని బీరాలు పోయినా ఆ ఫోన్ కాల్ వీళ్లకి క్లింటన్ బాన్‌క్వెట్‌కి ఇన్విటేషన్ పంపినంత సంతోషాన్ని కలగజేసింది. రెండురోజుల్లో అతను మొత్తం ప్రపోజల్ డాక్యుమెంటేషన్‌తోసహా వచ్చేశాడు. వాళ్ల సి.ఎ.ఓ. కృష్ణా ఒబెరాయ్‌లో విడిది చేశారు. వీళ్ల కంపెనీ లాయరుతో రెండురోజులు అక్కడ కూచుని అన్నీ తెల్సుకునేసరికి వీళ్లకి మిగిలిందేమిటయ్యా అంటే, వీళ్లు పెట్టిన పెట్టుబడి సగం తిరిగి ఇచ్చేట్లూ, వీళ్లు సెక్యూరిటీగా ఇచ్చిన పొలాలు వీళ్లకే ఇచ్చేసేట్లూ, అన్ని అగ్రిమెంట్స్ బరోడా కంపెనీకి ట్రాన్స్‌ఫర్ చేసేట్లూ, వర్కర్లనందరినీ కంటిన్యూ చేసేట్లు వగైరా, వగైరా చిన్నా చితకా డీటైల్స్‌తో సహా అన్నీ మాట్లాడుకోవడం ఐపోయింది.

ఇంక దొరికిందే అవకాశం వదులుకోకూడదు. బతుకు జీవుడా అనుకుని వెంటవెంటనే వ్యవహారాలు చక్క పెట్టుకుని, వాళ్లక్కగారికి కాయితాలిచ్చేసి, ఊరికి పంపేసి నెక్స్ట్ విమానం ఎక్కేశారు సకుటుంబంగా. ఇట్లా ఆ కథ సుఖాంతమయిందన్నమాట. కొద్దిగా డబ్బు, మరి కాస్త టైము పోతే పోయాయి కానీ, అనుభవం వచ్చిందని సంబరపడిపోయార్ట."

అత్తగారు లేచారు. "నే పోతున్నారా కిందకి. ఇంతా కష్టపడి చివరికి అరుకాషుడి నోట్లో పడ్డారా?"

"వాడెవడు మధ్యలో."

"అదే, వైకుంఠపాళిలో, వైకుంఠానికి బెత్తెడు కిందుండే పెద్ద పాము!"

"మరి వీళ్ల కంపెనీ ఏమైందే?"

"బామ్మకర్థమైంది మీ కవలేదర్రా. ఏమవుతుందా కంపెనీ. లక్షణంగా రెండు నెలల్లో ఫుల్ ప్రొడక్షన్‌కెళ్లింది. శ్రీరాఘవ టెక్నికల్ డైరెక్టర్‌గా, ఛీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా పదవీ స్వీకారం చేశాడు, పెద్ద ఫంక్షన్ పెట్టి. మళ్లీ అదే ఆఫీసర్లు, బ్యాంకులవాళ్లు, డీలర్లు, హితులు, సన్నిహితులు హాజరై శుభాకాంక్షలు చెప్పారు. కథ కంచికి - మనం కిందకి."

ఆలీ తెల్లబోయి చూస్తున్నాడు. "పోన్లే ఆంటీ, అందరూ మంచిగనే ఉన్నరు కదా. పాపం బరోడావాళ్లు సమయానికి మద్దతీయబట్టి వీళ్ల తక్లీఫులన్నీ జరంతలో పొయినయ్యి. పైవాడెపుడూ ఒక కంట చూస్తూనే ఉంటాడాంటీ!"

"నీ బొంద. పద తినడానికి. ఈ పూట అందరికీ కాండిల్ లైట్ డిన్నర్."